# తిరస్కృతి

"ఏమిటోయ్ అల్లుడా! నా కూతుర్ని పెళ్ళాడుతావా?"

"ఎంత తీయటి ప్రశ్న?"

పంచదారకన్నా, పానకంకన్నా, జుంటితేనెకన్నా, జున్నుకన్నా మధురమైంది కదూ!

సుందరమ్మత్త నోటిగుండా అలాంటిమాట వినడం ఎంతటివారికి కలగవలసిన మహద్భాగ్యం!

సుందరమ్మత్తకు మూడు మేడలున్నాయి. మూడైదుల పదిహే నెకరాల పొలం వుంది. ముచ్చటగా ముగ్గురు కూతుళ్ళున్నారు. అత్తగారికి కావలసిన అదనపు క్వాలిఫికేషన్ - ఆమెగారికి మగబిడ్డలు లేరు!

తిరుపతి వెంకటేశ్వరుడి సన్నిధానంలో నిల్చుని "నీకూ మాకూ పేరు లొక్కటైనా ఫలితాలుమాత్రం వేరువేరై పోయాయి ప్రభూ!" అంటూ వాపోయారట తిరుపతి వేంకటకవీంద్రులు.

సరిగా అలాగే నేను, రఘుపతి, నాగరాజు — మేము ముగ్గురం విడి వడని స్నేహితులమైతే సుందరమ్మత్తచేత అల్లుడా అనిపించుకునే భాగ్యం ఒక్క రఘుపతికే దక్కింది,

అనిపించుకుంటే చాలునా?

అందరూ రావద్దా?

పందిళ్లు వేయవద్దా ?

బాకాలు ఊదవద్దా ?

ఆడమనిషివైపు అలవోకగానైనా చూడడానికి బిడియపడిపోయే మా రఘుపతి ముద్దుల పెళ్లికుమారుడు కావద్దా ?

కావాలి.

ఎప్పుడు ? ఎప్పుడు ? ఎప్పుడు ?

ఆ శుభముహూర్త మెప్పుడు ?

తొందరపడకండి బాబూ, కథ మొదటినుంచీ చెబుతున్నాను.

* * * *

పాపన్నపేట ఒక సుమారుపాటి బస్తీ. నాకు తెలిసినప్పటినుంచి అదొక మేజరు పంచాయతీ గ్రామంగా వుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు, హోటళ్ళు, సెలూన్లు మొదలైన హంగులు పెరుగుతూ వచ్చినకొద్దీ ఆ వూరుకూడా పెరుగుతూ వచ్చింది. ఈ హంగులన్నీ ఏర్పడక మునుపు ఆ వూరి భౌతిక సంపద, సంతతిని గుత్తకు పుచ్చుకున్న ప్రాచీన కుటుంబాలు కొన్ని పాపన్నపేటలో వున్నాయి. ఆ కుటుంబాల సంఖ్య ఏవిధంగాచూచినా ఒక వందకు మించదు. రోమన్ సామ్రాజ్యంలో పూర్వం ఏనగరానికా నగరంగా కొన్ని నగరరాజ్యాలుండేవట. అలాగే పైన పేర్కొన్న వంద కుటుంబాల్లోనూ ఏ కుటుంబాని కాకుటుంబమే ఒక చిన్న రాజ్యం అలాంటి వంద కుటుంబాల్లో సుందరమ్మత్త దొకటి.

పాపన్నపేట చుట్టూరా చెరువులు, ఆ చెరువులక్రింద సుక్షేత్రాలు దండిగా వున్నాయి. వరిపంటకు, చెరకు తోటలకు ఆ పొలాలు పెట్టింది పేరు. ఈ సంవత్సరం వరి పండుతుంది. పై ఏడు చెరకు పైరవుతుంది. ఆ వరిపంటలోనూ ఈ చెరకు బెల్లంలోనూ యింటివాడుకక్రింద వినియోగ

పడేది తక్కువ. అమ్మకానికి వెళ్ళేది ఎక్కువ. అమ్మినప్పుడల్లా డబ్బు చేతికొస్తుంది. ఆ డబ్బు అచిరకాలంలో బంగారమౌతుంది. అందువల్ల పాపన్నపేట పొలాల్లో బంగారం పండుతుందనడం ఉత్ప్రేక్షకాదు. సహజోక్తి.

మరైతే యిక్కడొక ధర్మసందేహం. పాపన్నపేట పడతుల అందాలకు ఆ బంగారం మెరుగులు దిద్దిందని కొందరంటారు. మరికొందరు ఆవాదాన్ని త్రోసిరాజనడం కద్దు! పూల రెమ్మలను, మత్తమయూరాలను రాజహంసలను, చందమామను, శతపత్రాలను ఉపమా సామగ్రిగా తెచ్చుకోవలసిన పాపన్నపేట పొలతుల అందాలకు బంగారం మెరుగులు దిద్దడమేమిటి? తప్పు, తప్పు, వాళ్ళు ధరించడంవల్ల ఆ నగలకే ఒక వింత సోయగం అబ్బిందని వీళ్ళు వాదిస్తుంటారు.

మేము కాబట్టి ఆడవాళ్ళకు పెద్ద పెద్ద పదవులు కట్టబెట్టామని చెబుతూ తమ విశాల దృక్పథానికి దాఖలా చూపించుకునే వాళ్ళను చూస్తే నవ్వొస్తుంది. పాపన్నపేట కుటుంబరాజ్యాల్లో రాజ్యాధిపత్యం ఆదినుంచీ ఆడవాళ్ళదే! అక్కడ మగవాళ్ళు ఛీఫ్ గెస్టుల లాంటివారు. గెస్ట్ ఆర్టిస్టుల వంటివారు. సంచార రాయబారుల వంటివారు. టంకశాలలవంటివారు. వ్యవసాయం కావచ్చు, వ్యాపారం కావచ్చు, ఉద్యోగం కావచ్చు. చేస్తున్నది ఏ పని అయినా తమ తమ కుటుంబ రాజ్యాలకూ, బాహ్య ప్రపంచానికి మధ్య ఎడతెగని ఎగుమతులు, దిగుమతులు జరిపించడం మాత్రమే వారివంతు.

పాపన్నపేటతో నా కేర్పడిన తొలి పరిచయం పదిహేనేళ్ళనాటిది. అప్పటికింకా దేశంలోని పల్లెల్లోనూ, పేటల్లోనూ జన జీవనం నిశ్చల తటాకంలా ప్రశాంతంగా కనిపిస్తుండేది. ఇప్పటిలా బస్సుల్లో టిక్కెట్లు దొరకక ప్రయాణీకులు వీధుల్లో పడిగాపులు పడేవారుకారు. హోటల్లో

కుర్చీలు ఖాళీగాలేక, నిలువు కాళ్ళ శిక్ష పడవలసి వచ్చేదికాదు. సినిమా హాలు గోడకు 'హౌస్‌ఫుల్' అన్నబోర్డు వ్రేలాడేదికాదు. సాయంకాలాల్లో సైతం రోడ్లపైన చేతులూపుకుంటూ ధారాళంగా నడచిపోవడానికివీలుండేది. జీవితం పరుగుపందెంలా పరిణమించని ఆ రోజుల్లో పుస్తకాల సంచులు భుజానికి తగిలించుకొని చెట్లాపట్టాలతో రోడ్డుపైన నడచిపోతుండే ముగ్గురు హైస్కూలు కుర్రాళ్ళ స్నేహబంధం బహుశా పాపన్నపేట కీనాడుగుర్తుండక పోవచ్చు. ఆ ముగ్గురు కుర్రాళ్ళలోనూ ఒకడు ఆ వూరివాడే! వీడు మిక్కిలి వంద కుటుంబ రాజ్యాల్లో ఒక దానికి చెందినవాడు. ఇంచుక చామన చాయతో సన్నగా పొడుగ్గా వుండేవాడు. అతడే రఘుపతి!

రెండోవాడు నాగరాజు. పాపన్న పేటకు ఏడెనిమిది మైళ్ళదూరంలో చిట్టడవుల మయమైన ప్రాంతం ఒకటి వుంది. ఆ అటవీ ప్రాంతంలో గుట్టల నడుమ వాగుల కడ్డంగా కట్టిన పంటల క్రింద పొలా లేర్పరచుకుని కేవలం పైరు జీవనం మాత్రమే వృత్తిగా బ్రతికే పల్లెటూళ్ళు కొన్ని వున్నాయి. వాటిలో ఒక పక్కాకుగ్రామం నుంచి వచ్చినవాడు నాగరాజు. అడవుల్లో ముండ్లూ గుండ్లూ తప్పా మరేవీ వుండవన్న అభిప్రాయం ఒకటి వుంది. అడవి మల్లెలుండడం కూడా అడవుల్లోనేకదా; అచ్చంగా అడవిమల్లె పువ్వులాంటివాడు నాగరాజు. "తెల్ల జామపండు వంటి దేహ ఛాయగలుగు వాడు. ధవళమల్లి కోరకముల దంత పంక్తి గలుగువాడు." అన్నవర్ణన అతడి కెంతైనా నప్పుతుంది ముట్టుకుంటే కందిపోతాడేమోనన్నంత సుకుమారంగా వుండేవాడు. 'తలకొక జడ తగిలించి, నడుముకు పావడా బిగిస్తే నువ్వు నిజంగా ఆడపిల్లవేరా రాజూ!' అంటుండేవాడు రఘుపతి.

పోగా మిగిలినవాణ్ణి నేను. నా ఆకార విశేషాలతో ఈ కథకు బొత్తిగా ప్రమేయంలేదు. కనుక ఆ వివరాల జోలికి వెళ్ళడంలేదు.

హైస్కూలు గేటుకు అల్లంతదూరంలో రాజవీథి. ఆ వీథిలో పది పన్నెండు యిళ్ళ కవతల పంచాయతీ బోర్డు వారి పార్కు కెదురుగా వున్నదే సుందరమ్మత్త ఇల్లు. అది వెనుక వైపున మేడ. ముందరివైపున పెంకులతో దించిన వసారా. వసారా చుట్టూ సన్నటి రీపర్లతో అమర్చిన దడిలోపలి నుంచి ప్రారంభమౌతుంది సుందరమ్మత్త కుటుంబ రాజ్యం. ఎప్పుడైనా మంచినీళ్ళు త్రాగాలనిపిస్తే మా సుందరమ్మత్త యింటికి వెళదాం రమ్మనేవాడు రఘుపతి. ఆ యింటి చేదబావిలోవున్నవన్నీ మంచి నీళ్ళే! ఎన్ని బక్కెట్లు త్రాగినా సుందరమ్మత్త అభ్యంతరం చెప్పదు. ఏమాట కామాటే చెప్పుకోవాలి. అడపా దడపా ఆమె మాకు కాఫీ ఇస్తుండేది కూడా? ఒకటి రెండుసార్లు పళ్లు ఫలహారాలుకూడా తెచ్చిపెట్టి. దేశంలో దాతృత్వం తగ్గిపోతుండడాన్ని గురించి మాట్లాడుతూ ఆమె విచారాన్ని ప్రకటించడం కూడా నాకింకా బాగా జ్ఞాపకంవుంది, ఉపాయనా లిచ్చినా, యివ్వకపోయినా ఆమె చిట్టచివర ముగ్గురిలోనూ ఒక్క రఘుపతినిమాత్రం నిర్దేశించి 'నాకూతుర్ని పెళ్ళాడుతావా అల్లుడా!' అంటూ కవ్వించడానికి మాత్రం మరచిపోయేదికాదు.

వివాహమనగా అదెంతటి మధురానుభవమో ఆ వయసులో మాకేం తెలుసు? అయినా ఏవో అస్పష్టమైన ఊహలు చెలరేగకపోలేదు స్వయంగా పూలరథం లాంటిది సుందరమ్మత్త! ఆమె వైపు చూడడమే కన్నులకు పండుగ, ఆమె కూతుళ్ళు సైజులో మాత్రమే తేడాగావున్న పొదరిళ్ళు. ఇంట్లో ఎక్కడ చూచినా సుఖాసనాలు. నిరంతరం సన్నగా వినిపిస్తుండే రేడియో సంగీతం, హాల్లో తూగుటుయ్యాల. గదుల్లో నిలువుటద్దాలు పెరట్లో సన్నజాజి పందిరి. ఓయబ్బో సుందరమ్మత్త కూతురికి మొగుడు కావడం కన్నా అదృష్టమా?

ఎలాగైనా మా రఘుపతి అదృష్టవంతుడు!

అదృష్టం కాకపోతే సుందరమ్మత్త అతడికి స్వయానా మేనత్త కాదట! మేనమామ పెళ్ళామైనా కాదట! బీరకాయ పీచులాంటి దూరపు బంధుత్వాన్ని బట్టి ఇతడి కామె అత్తకావలసి వస్తుందట! ఆ మాత్రానికే ఆమెకు తనలో అల్లుడు కనిపిస్తున్నాడంటే రఘుపతి అదృష్టాన్ని ఏమని కొనియాడాలి?

అయినా యిప్పుడింత దూరం సాగదీసి చెబుతున్నానుగానీ. అప్పుడు మావాడి కంతగా వివాహం పైన ధ్యాసలేదు చదువులు పరీక్షలు మార్కులు ఆ గొడవలతోనే అరేళ్ళ హైస్కూలు విద్యాభ్యాసం ముగిసింది, నాగరాజు మంచి మార్కులతో ప్యాసయ్యాడు రఘుపతి సగటు మార్కులు మాత్రమే తెచ్చుకున్నాడు. నా విద్యాభ్యాసం అంతటితో పూర్తయింది. కనుక నా మార్కుల్ని గురించి చెప్పుకోవలసిన అవసరం కనిపించదు.

వాళ్ళిద్దరు మాత్రం కళాశాల మెట్లెక్కారు ఆ ఇద్దరిలోకూడా చదువుల సముద్రం లో లోతుల్ని ముట్టి వచ్చే ఓ పరికరం రఘుపతికి లేకపోయింది. అతడు పట్టాచేతికి రాగానే కొద్ది రోజులు ట్రెయినింగ్ పొందినవాడై తిరిగి వచ్చి చదువుకున్న పాపన్నపేట హైస్కూల్లో పంతులుగా కుదిరిపోయాడు.

ఏదో పనిబడి ఇటీవల ఒకసారి పాపన్నపేట వెళ్ళాను. బస్టాండులోనే కనిపించాడు రఘుపతి. హోటలుకు వెళ్ళి ఉపాహారం ముగించాము. దీప దీపాలవేళ పాపన్నపేట రాజవీధి పైన నడుస్తూ చిన్ననాటి మధురానుభూతుల్ని నెమరువేసుకోవడం మనసుకెంతో ఆనందదాయకం. కానీ ఆవీధి వెంట నడవడానికి రఘుపతి ఎందుకో తటపటాయిస్తున్నట్టు తోచింది. ఆఖరి కతడు కారణంకూడా చెప్పేశాడు.

"ఈ వైపుగా వెళ్తే సుందరమ్మత్త చూస్తుందిరా శేఖరం! వద్దు బాబు! ఇలా వెళదాంరా" అన్నాడు.

నిజం చెప్పొద్దూ, నాకు కాస్త కోపం వచ్చింది. "సుందరమ్మత్తకు తరచుగా కనిపించవలసినవాడివి నువ్వు! ఆవిడ కంటపడకుండా ముఖం చాటుచేసుకుని తిరగవలసిన గ్రహచారం నీకేంపట్టింది? అన్నాను.

"అబ్బే నీకు తెలియదులేరా శేఖరం!" అన్నాడు రఘుపతి.

'తెలియనివానికి సుఖంగా తెలుపవచ్చునని భర్తృహరి చెప్పలేదా రఘుపతి!' అన్నాను.

రఘుపతి ప్రారంభించాడు

'సుందరమ్మత్త కూతుళ్ళలో పెద్దవాళ్ళ కిద్దరికీ పెళ్ళిళ్ళయి పోయాయి.'

"శుభం! లైన్ క్లియరయిందన్నమాట! ఈడూజోడూ ముఖ్యమనుకుంటే మూడో అమ్మాయినే గదా నువ్వు పెళ్ళాడవలసింది....'

ఎదుట వాడి అవివేకానికి జాలిపడుతున్న విరాగిలా రఘుపతి ఫక్కుమని నవ్వేశాడు.

"లోకం నువ్వనుకున్నంత అమాయికంగా లేదురా శేఖరం! సుందరమ్మత్త నన్ను, నాకూతుర్ని పెళ్ళాడుతావా అని అడుగుతుండేది! నిజమే! కానీ అలా అడగటంలోని అంతరార్థ మేమిటో నీకు తెలియదు నాకూతుర్ని పెళ్ళాడడానికి తగినంత ఎత్తుకు నువ్వు పెరగగలవా? అన్నదే ఆమాట వెనుకనున్న వ్యంగ్యార్థం, సుందరమ్మత్త కుటుంబ రాజ్యానికింక కావలసిన అల్లుడి పదవి ఒక్కటే! ఆపదవికోసం ప్రయత్నిస్తున్న వారినొకవరుసలో నిల్చోబెడితే అక్యూ ఒక రెండు ఫర్లాంగుల పొడవు వుంటుంది. ఎలాగైన నాపట్ల సుందరమ్మత్తకు కాస్త ప్రత్యేకాభిమానం లేకపోలేదు. అక్యూలో నిలబడి ఉత్తపుణ్యానికి నేనా ఒత్తిడిలో నలిగిపోడమెందుకని ఆమె నన్ను వారగాతీసి, నామట్టుకు నాకు యింకొకపని అప్పజెప్పింది ..'

'ఏమిటది?' విస్తుపోతూ అడిగాను.

"మరేంలేదు. ఎప్పటికప్పుడు ఆ క్యూలో నిల్చున్న వాళ్ళందరినీ వరుసగా లెక్కపెట్టడం. సుందరమ్మత్త సూచనలమేరకు క్రొత్తవాళ్ళని చేర్చడం, పనికిమాలిన వాళ్ళను తీసేయడం. మళ్ళీ మొదటినుంచి లెక్కపెట్టడం...."

'ఏడ్చావులేరా రఘుపతి! ఆ పనికి నువ్వెందు కొప్పుకున్నావు' అన్నాను.

"నా మొహం నేను ఒప్పుకోవడమేమిటి? మనం తలచుకుంటే సుందరమ్మత్తకు కనిపించకుండా వుండవచ్చు కనిపిస్తే ఆమె పిలుస్తుంది. మనం వెళతాం కూర్చోమంటుంది, కూర్చుంటాం. మాట్లాడుతుంది. వింటాం. వెళ్ళిరమ్మంటుంది. వెళతాం. అంతే! అక్కడ నానీయిష్టా యిష్టాలతో ప్రమేయం వుండదు....'

ఏదో రహస్యం చెప్పదలచుకున్నట్టుగా మరింత చేరువగా వచ్చాడు రఘుపతి.... 'అయినా సుందరమ్మత్త కూతురికి మొగుడుగా నేను తగుదునని నువ్వుమాత్రం ఎలా అనుకోగలవురా శేఖరం! నా జీతం ఆమెగారి ఫేసుపౌడర్లకైనా చాలదు ..."

నాముఖాన కత్తివేటుకు నెత్తురుచుక్కలేదు.

అంతలో మేము పంచాయతీ బోర్డువారి పార్కుదగ్గరకిరానే వచ్చేశాము, సన్నటి రీపర్ల సందుల్లోనుంచీ మగువ పొలకువ తెలుపుతూవాయిల్ చీర తాలూకు పూతలు, పిందెలు, ఆకులు, కాయాలూ కనిపించనే కనిపించాయి. సుందరమ్మత్త పిలవనే పిలిచింది.

'ఎంతో నయం! త్రిమూర్తుల్లో యిద్దరైనా కనిపించారు, ఎప్పుడొచ్చావోయ్ శేఖరం! వెద్దురుగానీ కాసేపుకూర్చోండి....కాఫీ పుచ్చుకుంటారు గదూ!'

ఇందాకా మేము హోటల్లో చేసిన పని అదేనమ్మా అత్తయ్యా! పని మీద వెళ్తున్నాము. నీ పుణ్యానికి నువ్వు మాకు తొందరగా సెలవిప్పిస్తే చాలు!'—నువ్వు నాకు అత్తవీ కాబోడంలేదు. నేను నీకు అల్లుణ్ణి కాబోవడం లేదు. ఇక నీకూ నాకూ మధ్య మొగమాటాలెందుకు—అన్న భావన రఘుపతి మాటల్లో ద్యోతక మౌతోంది.

'అయ్యో రాజా! మీకు వెళ్ళాలని వుంటే నేను బలవంతంగాకూచో బెడతానా రఘుపతీ! అసలు మాయింటాయనైనా అలాంటి నిర్బంధాలు ఎరుగడే! తన యిష్టం. తన రాజా! ఎక్కడికైనా వెళ్ళొచ్చు. ఎప్పుడైనా తిరిగి రావచ్చు. ఎందుకు, ఎక్కడికి. ఎప్పుడు అంటూ సాగదీయడం ఈ యింటా, ఒంటాలేదే. ఆ మాటకేంగానీ అసలు విషయంలోకే వద్దాము. మొన్న నేను చెప్పిన విషయం ఏం చేశావు?'

"ఓహో, అదా! లేడికి లేచిందే పరుగను కుంటే ఎలాగమ్మా? అత్తయ్యా! నేను తిరుపతికి వెళ్ళాలిగదా! వెళ్ళాలంటే సెలవు దొరకాలి కదా!"

'ఇక్కడున్న తిరుపతికి వెళ్ళిరావడానికి సెలవు కావలసి వచ్చిందా నీకు! సాయంకాలం వెళ్తే తెల్లవారే సరికల్లా తిరిగిరావచ్చు. ఎలాగూ మీరిద్దరూ కలిశారు. మా యింటాయననుకూడా పంపుతాను. ముగ్గురూ కలిసి బయల్దేరి రేపో మాపో వెళ్ళొచ్చేస్తే సరిపోదూ!'

నిస్సహాయ పరిస్థితిలో పడిపోయినట్టుగా నా వైపు బిక్కు బిక్కుమంటూ చూచాడు రఘుపతి.

'తిరుపతి కెందుకురా రఘుపతీ!' అన్నాను సుందరమ్మత్తే బదులు చెప్పింది.

"ఓహో నీకు తెలియదుగదూ! చల్లకొచ్చి ముంతదాచుకుంటామా శేఖరం! మరేంలేదు. మా వసంతకు సంబంధం కోసం....'

'తిరుపతిలో సంబంధం చూస్తున్నారా ఏమిటి?'-ప్రశ్నించాను.

'మన ఎరుకలోని సంబంధమే! రోజుకొక సంబంధాన్ని గురించి మాచెవిదాకా రాకపోవడంలేదు. మొన్న ఎవరో కాళహస్తి ప్రాంతాలనుంచి వచ్చారు. అబ్బాయి యింజనీరుట! అంతకు మునుపు వాళ్లెవరో మద్రాసు నుంచీ కార్లల్లోదిగారు. వాళ్ళబ్బాయికి బొంబాయిలో ఉద్యోగమట! కానీ బిడ్డను తీసుకెళ్ళి కొత్త జాగాలో యివ్వడం నాకిష్టంలేదు. మీకూ స్నేహితుడు, నాకూ చిన్ననాటినుంచి తెలుసు. వాళ్ళవూరుకూడా యిక్కడెక్కడో దగ్గరేనట....'

సుందరమ్మత్తకు అడ్డు తగులుతూ రఘుపతినే ప్రశ్నించాను.' ఎవర్ని గురించిరా రఘుపతీ! మన నాగరాజుకు యివ్వాలనుకుంటున్నారా ఏమిటి ?'

'నీది వట్టి మట్టిబుర్రరా శేఖరం!' అన్నాడు రఘుపతి.

కానీ నేను రఘుపతి పరిహాసాన్ని సరకుచేసే స్థితిలోలేను. లోలోపల నా ఆనందం అవధులుదాటుతోంది. ఎవడో దారంటవెళ్ళే దానయ్య ఒకడు సుందరమ్మత్త కూతుర్ని ఎగరేసుక పోకుండా ఆ అదృష్టం మానాగరాజుకు దక్కినా నాకు సంతోషమే! ఆ మాటకొస్తే యిది 'బెస్ట్ సెలక్షన్' అని కూడా చెప్పవచ్చు. నాగరాజు రఘుపతిలా అల్లాటప్పా హైస్కూలు టీచరు కాడు. వాడికి ఎం. ఏ లో ఫస్టుక్లాసు వచ్చింది. అది చాలక కలకత్తావెళ్ళి అదేదో ప్రత్యేకమైన కోర్సులో రెండేళ్ళుండి వచ్చాడు. అలాంటి చదువు చదివినవాళ్లు ఈ దేశం హోల్‌మొత్తం పైన డజనుమందికి మించిలేరట! ఇప్పుడైతే వాడు లెక్చరరేగానీ అనతికాలంలో ప్రొఫెసరు గిరీ వాణ్ణి ఏరీ కోరీ వరించాలి, తప్పదు. బియ్యం, బేడలు, నూనె, మిరపకాయలు మొదలైన వస్తుసంబారాలన్నీ వాడి కింటిదగ్గరినుంచి సరఫరా అయ్యే అవకాశం

లేకపోలేదు. ఇక వాడు తన జీతాన్నంతా పెళ్ళాం ఫేసు పౌడర్ల క్రిందే ఖర్చుపెట్టినా అడిగే నాథుడుండడు!

'ఇందులో తటపటాయించ డానికేముంది. రఘుపతీ! రేపే వెళదాం. మారుమాట లేకుండా నాగరాజు యిందుకు ఒప్పుకోగలడన్న నమ్మకం నాకుంది' అన్నాను.

'ఒప్పుకో కేంచేస్తాడు! ఇక్కడెవరూ చేదుమేయమనడం లేదే!' అందుకుంది సుందరమ్మత్త—'పెద్దల్లుళ్ళ దేముంది? వాళ్ళెప్పుడో పాత బడిపోయారు. మా ముద్దులూ, మురిపాలూ అన్నీ యిక చిన్నల్లుడివేగదా! మాకూ ఒక లక్ష, లక్షన్నర రూపాయల ఆస్తిపాస్తులున్నాయి. ఇప్పటి కిప్పుడు వ్రాసి రిజిష్టరు చేయకపోయినా ఆస్తిలో మూడోవంతు నీదేకదా! కాదు కూడదు కట్నం కావాలంటావా, సరే నీ యిష్టం! మేము పెద్దల్లుడికి వదివేలిచ్చాం. రెండో అల్లుడికి పన్నెండు వేలిచ్చాం, నువ్వు కావాలిస్తే పది హేనువేలు పుచ్చుకో. ఇదిగో అబ్బాయ్? నీకింకా పెద్ద ఆశలేవుండవచ్చు. మనవైపున పదివేల రూపాయలు పలుకుతున్న పెళ్ళికొడుకు, ఉత్తరాదికి వెళ్తే లక్షరూపాయలదాకా పలుకుతున్నమాట నేను కాదనను, కానీ ఆ ఉత్తరాది ఆసామికి నాలాగే ముగ్గురు కూతుళ్ళున్నారనుకో! కూతురి కొక లక్ష చొప్పున పంచిపెడితే చివరి కతడికేం మిగులుతుంది? బొచ్చె చేతికొస్తుంది. నీకొక అత్తగారిల్లు వుందనిచెప్పుకోడానికైనా వీలుండదు. బాబ్బాబూ! ఎందుకొచ్చిన ఎవ్వారాలని! నువ్వు మాకు నచ్చావు. చిన్నప్పు డెప్పుడో చూచావుగనుక, ఎందుకైనా మంచిది—నువ్వూ ఒకసారివచ్చి అమ్మాయిని చూచివెళ్లు. పందిరిలో పదిమంది ఎదుట పుచ్చుకోవడం నీ కిష్టం లేకపోవచ్చు. వద్దు. పెళ్ళికి ముందుగానే పదిహేనువేలకు నువ్వు చెక్కు పుచ్చుకో? పిల్ల ఒంటిపైన అయిదువేల రూపాయల బంగారం చూచుకో. నీ దుస్తులకూ రిస్టువాచీకి ఓ వెయ్యి ప్రత్యేకం. నీ వెక్కడ కోరితే అక్కడే

జరిపిద్దాం పెళ్ళి. ఇంకొక వారం రోజుల్లో పెళ్ళి జరిగిపోవాలను. మాకే అభ్యంతరంలేదు. లేదంటే నీ మనసులో నీ కొక సందేహం వుండవచ్చు ఓ యబ్బో, సుందరమ్మగారి సంబంధమా ? వాళ్ళతో మనం తూగగలమా అని. నేను చెబుతున్నానుగా. నీకా సందేహం అక్కర్లేదు. పల్లెలోనీకు ఆస్తి వుంది. లేదు. ఆ సంగతి మా కనవసరం ! ఒకసారిగా పదిమందివస్తే వాళ్ళుండడానికి తగినపాటి యిల్లు నీ కక్కరలేకపోవచ్చు. మరేంపరవాలేదు. ఆ మాటకొస్తే ఆయన డబ్బంతాపోసి పల్లెలో యిల్లు కట్టడం నాకిష్టంలేదు. ఆ డబ్బుంటే హాయిగా టౌన్లోనే యిల్లు కొనుక్కోవచ్చు.... వింటున్నావా శేఖరం ! ఒకవేళ రఘుపతి మరచిపోయినా నువ్వీ వివరాలన్నీ నాగరాజుకు విశదంగా చెప్పాలి....'

"అలాగేనండీ, అలాగే ! తప్పకుండా చెబుతాను" అన్నాను.

సుందరమ్మత్త దోషమేమీలేదు. ఆమె మాతో బాటుగా వాళ్ళ ఇంటాయనను కూడా ప్రయాణానికి సిద్ధం చేసింది. కానీ ఆరోజు సాయంకాలం జిల్లాపరిషత్తు ఛైర్మెన్‌గారు వచ్చి ఊళ్ళో దిగడంతో ఆయన తప్పనిసరిగా ఆగిపోవలసి వచ్చింది.

స్టేషనులో రైలుదిగి రూముకు వెళ్ళేసరికి గంట ఎనిమిదికావచ్చింది. మేము కనిపించిన క్షణం నుంచి మొదలుపెట్టి నాగరాజు అతిథి సత్కారాలు చేయసాగాడు. మేమంత దూరం వెళ్ళామంటే అందుకొక ప్రత్యేక కారణం వుండి వుంటుందన్న యింగిత జ్ఞానమే లేదు. మనిషికి ! అతడి కుశల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికే అరగంటసేపు పట్టింది ఆ తరువాత హోటలు కని. సినిమాకని, పురవీథులపైన త్రిప్పుతూ, అతడు మారి పోతున్న సమాజ స్వరూపాన్ని గురించి మాకు టూకీగా వివరణ లివ్వ సాగాడు. అర్ధరాత్రి సమయంలో నిద్రపోవడానికి ముందుగా వివాహ ప్రస్తావన తీసుకరావడానికి వీలయింది. అంతవరకు కొంత నిర్లిప్తంగా వుండి

పోయిన రఘుపతి కూడా అవసరంగానే నాకు ప్రక్క బలమై నిలిచాడు. 'ప్రతిపాదించడం నా వంతు. బలపరచడం వాడివంతు. స్వాభిప్రాయ విశేషాలతో రంగరించి. సుందరమ్మత్త చెప్పిపంపిన పాఠాన్ని తుచ తప్పకుండా ఒప్పగించాము. చిట్టచివర తలక్రిందుల తపస్సు చేసినా తన కింత కంటె మంచి సంబంధం దొరకదని తేల్చి చెప్పేశాము.

పెదవులపైన చిరునవ్వు, కళ్ళల్లో నిశ్చలత్వం ముఖంలో ప్రశాంతత ఆ లక్షణాలన్నీ చూస్తుంటే మా ప్రతిపాదన నాగరాజుకు రుచించినట్టే తోచింది. మౌనం అర్ధాంగీకారం కదా! తెల్లవారే సరికి అది పూర్ణాంగీకారం కాగలదన్న నమ్మకంతో నిశ్చింతగా నిద్రపట్టింది.

తెల్లవారింది. ఎనిమిదింటికే రైలు, సాగనంపడం కోసం స్టేషన్‌కు వచ్చాడు నాగరాజు.

"మీా రిద్దరూ కలసి వచ్చి నన్నొకసారి యిలా మరామర్శించి వెళ్తున్నందుకు నాకెంతో ఆనందంగా వుంది. ఇలాగే తరచుగా వస్తుండాలి మీారు........" అన్నాడు.

స్టేషనులో రైలాగింది. ఎక్కి కూర్చున్నాము.

రైలు బయల్దేరడానికింకా నాలుగైదు నిమిషాలకన్నా వ్యవధి లేదు.

కంపార్టుమెంటు దగ్గరగా వచ్చి కిటికీ దగ్గరగా నిల్చుని "కానీ నన్నొకందుకు మన్నించాలి మీారు" అన్నాడు నాగరాజు.

"ఎందుకూ, ఎందుకూ"

నేనిప్పు డిప్పుడే పెళ్ళిచేసుకునే ఉద్దేశంలో లేను, అసలెప్పుడు చేసుకొంటానో చెప్పలేను. మీారు తెచ్చిన సంబంధాన్ని నిరాకరించానని మీారు నాపైన కోప్పడ కూడదు ......."

"నువ్వు ఒప్పుకోకుంటే ఇక్కడ పుట్టి మునిగి పోయేదేమీలేదు. కానీ ఎందు కొప్పుకోవో చెప్పకుండా నువ్వుతప్పించుకోలేవు. చెప్పు ఎందు కొప్పుకోవు ?" అంటూ నిలదీసి అడగడానికి వీల్లేకపోయింది. యాత్రీకులు కొందరు ఒక తండగావచ్చి ద్వారంగుండా కిటికీలగుండా లోపలికి చొరబడ డానికి ప్రయత్నించడంతో. నాగరాజు కాస్త వెనుకకు తప్పుకున్నాడు. ఆ సంరంభం తగ్గేసరికి రైలు కదిలింది.

* * * *

సుందరమ్మత్తగారి సంబంధాన్ని నాగరాజు నిరాకరిస్తే నిరాకరించాడు గాని. అతడెందుకు నిరాకరించాడన్న ప్రశ్న నాకొకసమస్యగా తయారైంది.

ఉన్నదానితోబాటుగా దాని కింకొక క్రొత్త సమస్యను జతచేశాడు, నాగరాజు,

ఇప్పుడిప్పుడే పెళ్ళి చేసుకునే ఉద్దేశంలోలేను. ఎప్పుడు చేసుక్కుంటానో చెప్పలేను— అన్న పెద్దమనిషి మూడుమాసాలు గడువకమునుపే నాకు శుభలేఖ పంపించాడు.

ఆ సంబంధాని కొప్పుకోని వాడు. దీనికెలా ఒప్పుకున్నాడు?

నాకుమటుకునాకు కొన్ని కారణాలు స్ఫురించకపోలేదు.

బహుశా తన అంచనాకుమించిన కట్నం ముట్టి వుండాలి. లేదా అమ్మాయి తల్లిదండ్రుల కేకైక సంతానమైనా అయివుండాలి. కాదా చదువుకుని ఉద్యోగం చేస్తూ బంగారుగుడ్లబాతు చందాన మొగుడికి ఉపక రించేదైనా కావాలి....

కారణమేదైతేనేమిగాని నాగరాజు కేమో పెళ్ళి జరిగిపోయింది. ఆ పెళ్ళికి నేను వెళ్ళలేదు, బంగారంలాంటి సంబంధం తీసుకెళ్తే ఆ ప్రబు

ద్ధుడు నాముఖానికి మసిపూసి పంపాడు. వాడి పెళ్ళికి నేనే ముఖం పెట్టుకుని వెళ్ళను.

కానీ రఘుపతికి మాత్రం యిలాంటి పట్టింపులేవీ లేకపోయాయి. వాడు తగుదునమ్మా అంటూ నాగరాజు పెళ్ళికి వెళ్ళివచ్చాడు. వెళ్ళివచ్చిన వాడు అంతటితో పూరుకొనగూడదా ? ఊరుకోలేదు. ఇదిగో నీ సమస్యను మరింత జటిలం చేసివేస్తున్నానన్నట్టుగా వాడొక ఉత్తరం ముక్క వ్రాసి పారేశాడు.

నాగరాజుకు పిల్లనిచ్చిన ఊరు తిమ్మసముద్రం. ఎంచినట్టుగా ఆ ఊరిలో పాతిక కుటుంబాలున్నాయట. అక్కడివారిలో పెద్ద మోతుబరు లేవరూలేరు. నాగరాజు మామగారికికూడా నాలుగైదెకరాల మాగాణీ. ఒక చిన్న మామిడితోట మినహాగా పెద్ద ఆస్తిపాస్తులేవీలేవు. నలుగురు మగ బిడ్డలతో అయిదుగురు ఆడబిడ్డలతో తామరతంపరలాంటిసంతానంఆయనకు. ఆ పుత్రికాపంచకంలో నాగరాజు కిచ్చింది నాలుగో అమ్మాయిని. వారి గొప్పగా కట్నాలిచ్చుకునే స్థితిగతులులేవు. పోగా అమ్మాయికూడా ఏమంత అందగత్తెగాదు. కొద్దిపాటి నాటుచదువు మాత్రం చదువుకుని వుంటుందని రఘుపతి ఊహ! మరి దేన్నిచూచి నాగరాజు ఈ సంబంధానికొప్పు కున్నాడో తన కర్థంకాలేదని వ్రాశాడు రఘుపతి.

రఘుపతి జాబుచూచిన తరువాత నామటుకు నాకు అమందానందం కలిగింది. శ్రేయోభిలాషులమాట విననందుకు నాగరాజు కిలాంటి శాస్తి కావలిసిందే ?

కానీ ఈ ఆనందాన్నయినా నాకెంతో కాలందక్కనిచ్చాడు కాడు నాగరాజు!

వాడి దగ్గర నుంచి నాకో ఉత్తరం అందింది.

"డియర్ శేఖరం!

నమస్తే! నాపట్ల నువ్వింత దారుణంగా ప్రవర్తించగలవని నేను కలలోనైనా అనుకోలేదు. నువ్వు చెప్పిన అమ్మాయిని నేను పెళ్ళిచేసుకో లేదు. అదే నీ దృష్టిలో నేను చేసిన నేరం. ఎందుకు చేసుకోలేదన్న విషయం నీకింతవరకూ అర్థం కాలేదు. ఇకపైన అర్థం కాగలదన్న నమ్మకమూలేదు. అందుకనే యిలా జాబు వ్రాస్తున్నాను.

సుందరమ్మత్త నీకు దగ్గరి చుట్టంకాదు, నేనామెను ఎలా ఎరుగుదునో నువ్వూ అలాగే ఎరుగుదువు. కాని పనిగట్టుకుని నువ్వామె తరఫున వకాల్తా పుచ్చుకున్నావంటే, అందుకు కారణమేమైవుంటుందని నేను తీవ్రంగా ఆలోచించాను. మరేంలేదు! ఆమెచేత మన్నన పొందాలని నీ తాపత్రయం. ఈ ఉబలాటమే గనుక లేకపోతే నువ్వు నీ వయసుకు మించిన పెళ్లిళ్ళ పేరయ్య బాధ్యతను నీ భుజస్కంధాలపైన వేసుకోవడానికి సమ్మతించి వుండవు.

మనిషికి రెండుకళ్ళున్నాయి వాటిలో ఒకటి తక్కువగాదు. ఇంకొకటి ఎక్కువాగాదు. నీకు మేమిద్దరం స్నేహితుల మున్నాము. సుందరమ్మత్త ఆదినుంచీ రఘుపతికి పిల్ల నిస్తానని చెబుతుండేది. కానీ తీరా సమయం వచ్చే సరికి ఆమె తన మాటను వాయిదా చెల్లిన ప్రోనోటుగా తీసి పారేసింది. అందువల్ల నీకు చీమ కుట్టినంతబాధయినా కలుగలేదు. కానీ అది పిల్లను నాకివ్వడానికి ముందుకొచ్చేసరికి నీకు ఏనుగెక్కినంత సంబరంకలిగింది. అందుకనే నిన్ను నేను సూటిగా ప్రశ్నిస్తున్నాను. రఘుపతి తన పెళ్ళాన్ని తను పోషించుకోలేకపోడు. ఆపని నువ్వూ నేనూ ఎంతబాగా చేయగలమో రఘుపతికూడా అంత బాగానే చేయగలడు, ఆ మాటకొస్తే ఈ దేశంలో కొందరు బిచ్చగాళ్ళకు సైతం యిద్దరు ముగ్గురు పెళ్ళాలున్నారు. రఘుపతి నాకన్నా ఆరోగ్యవంతుడు అతడి కున్నంత లౌకికజ్ఞానం నాకులేదు. నా కున్నంత ఆస్తిపాస్తులు అతడికీ వున్నాయి. దేవుడు దయదలిస్తే ఉబుసు

పోకకంటూ చేస్తున్న ఆ ఉద్యోగాన్ని వదిలిపెట్టి ఏ వ్యాపారరంగంలోనైనా దిగి అతడేడాది తిరిగేలోగా ఒక లక్షరూపాయలు ఆర్జించగలడు. కానీ యిన్ని అర్హతలున్నా సుందరమ్మత్త దృష్టిలో రఘుపతి కొరగానివాడైపోయాడు. నేను కాస్తాకూస్తా అర్హుణ్ణిగా కనిపించాను. ఎందువల్ల ?

ఒక్కటే కారణం !

రఘుపతి తన కుటుంబంలో తానొక్కడై మసలుకుంటున్నాడు. తల్లీ తండ్రీ, అన్నా వదినా, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ, అందరూ కలిసి ఒకటిగా కూర్చున్న గ్రూప్ ఫోటోలో తాను ఒక వైపుకు సర్దుకుని కుర్చుంటూ వుండడమే అతడు చేసిన అపచారం! మీ సుందరమ్మత్తకు గ్రూప్ ఫోటోలు గిట్టవు! అమాంతంగా అందమైన పార్సెల్ ఒకటి తనవాకిట్లో దిగబడాలి. మెల్లగా మడతవిప్పి, అందులోనుంచి కాగితం తుక్కునంతా పైకి తీసేసరికి మడిమలదాకా పాంటు తొడుక్కున్నవాడు. పైన పొట్టిచేతుల చొక్కా తగిలించుకున్నవాడు, కళ్ళద్దాలు వేసుకున్నవాడు. నున్నగా క్రాపు దువ్వుకున్నవాడు. నూనూగు మీసాలవాడు. రుద్దుకున్న ఫేసు పౌడరు. సెంట్ల గుమగుమలతో ఎదుటవారికి గుబులు పుట్టించేవాడు అయిన అబ్బాయి ఒకడు పైకి లేవాలి, వాడి చేతుల్లో గులాబీ పూలదండ ఒకటి సిద్ధంగా వుండాలి. వాడు తన కుమార్తెను వరించాలి. సుందరమ్మత్త కోరిక యింత మాత్రమే కాదు. ఆ అబ్బాయి ఏ పార్సెల్లోనైతే వచ్చాడో ఆ పార్సెల్‌పైన "ఫ్రమ్ అడ్రస్" ఉండకూడదు ఉండదనే అనుకుందాం! ఏమో, ఎవరు చూచారు? లోపల ఎక్కడైనా తగలడి వుందేమో అబ్బే. ఈ పార్శెల్ కంటికి కనిపిస్తుండడమేముప్పు! దీన్ని ఏకంగా తగలబెట్టడమే ఒప్పు!

కాకపోతే మిస్టర్ శేఖరం! ఇక్కడ ఈ విశ్వ విద్యాలయంలో ఒక లెక్చరరుగా చలామణీ అవుతున్న ఈ నాగరాజు అనే పూలమొక్కకు వ్రేళ్లెక్కడున్నాయో తెలియదా మీ సుందరమ్మత్తకు! తల్లిదండ్రులను

ప్రత్యక్ష దేవతలుగా భావించేవారట పూర్వులు. ఆచారమైన పరిగణన మనకొద్దు, కనీసం నవమాసాలు మోసి వుండదా తల్లి! ప్రాణానికి ప్రాణంగా చూచుకుంటూ పెంచివుండదా? తండ్రి చెమట తుడుచుకోడానికైనా తీరికలేక బ్రతుకుబండినిలాగుతూ. నిట్టూర్పులు వదిలినప్పుడల్లా తన వంశాంకురం పెరిగి పెద్దదైతే కానీ బాధ్యత నుంచి విముక్తిపొంది దాని ప్రక్కనవున్న ఓ చెట్టు క్రింద కూర్చుని విశ్రాంతి తీసుకోవచ్చునని అభిలషించి వుండదా? కేవలం వాళ్ళ పెద్దరికపు మర్యాదకు వారికి చెల్లించడం కోసమైనా వాళ్ళతో ఒక్కసారి సంప్రదించకూడదా! ఆఊరు ఎక్కడుందో నాకు తెలియదు. కాని అక్కడికి వెళ్ళాల్సిన అవసరం కూడా నాకాట్టే కనిపించడంలేదు. అని ఆవిడ నీతో చెప్పడమూనూ. ఆమాటపైన నువ్వు బయల్దేరి చక్కానా దగ్గరికి రావటమూనా! బాగుందిరాబాబూ! మూలమట్టంగా భూమిలో నుంచి వ్రేళ్ళను పైకిలాగి కాండంపైన ఆకులపైన నీళ్లుపోస్తూ మొక్కను పెంచాలనుకుంటున్నారా మీరు!

వ్రాయవలసివచ్చి యింతదూరం వ్రాశాను. నీకు బాల్యస్నేహితుణ్ణి. తెలిసో తెలియకో నామూలంగా తప్పిదం జరిగివుంటే అందుకు నువ్వు నన్ను మన్నించగలవు. తప్పకుండా బదులు వ్రాస్తావుగదూ....నీ నాగరాజు'.

జాబు చదువుకొనిన తరువాత నిండుగా ఒకగంటసేపు నేను స్తబ్దుడినై కూర్చుండిపోయాను. వ్యవధిలో ఎన్నెన్నో వూహలు నిశ్శబ్దంగా నా మనస్సులో ప్రవహించిపోయాయి. వాటిలో మచ్చు కొకటి మాత్రం ఇక్కడ చెబుతేచాలు! ఈ 'క్లూ' నాకానాడే తెలిసివుంటే ఎంతబాగుండేది.! "అబ్బే అలా కాదండీ సుందరమ్మత్తగారూ! ఒక పర్యాయం మీరా ఊరికి వెళ్ళిరావలసించే! తప్పదు. ఆ ఊరికి కారువెళ్తుందేమో కనుక్కుందాం లేదంటే జట్కాబండితో సరిపెట్టుకుందాం. ఒక్కటంటే ఒకటే పర్యాయం. ఒక ఎక్స్కర్షన్‌లా వెళ్ళి వచ్చేద్దాం" అంటూ సుందరమ్మత్త నెలాగైనా బయల్దేరదీయడానికి వీలుండేది, గడుగ్గాయి నాగరాజు నాకా అవకాశాన్ని దక్కనివ్వరేదు. చేతులు కాలిన తర్వాత ఆకులుపట్టుకుని ఏం లాభం?